క్లుప్తంగా

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి



గాత్ర కచేరి నిర్వహిస్తున్న అక్కిరాజు

శ్రీకాకుళం కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద రామచంద్రాపురానికి చెందిన షిర్డీ సాయి స్వర సుధ ఆధ్వర్యంలో అక్కిరాజు పర్యవేక్షణలో భక్తి సంగీత విభావతి నిర్వహించారు. మంగువారితోటలో సంపత్ వినాయక ఆలయం వద్ద సత్యసాయి నాదస్వర బృందం, సింహాచలం బ్రదర్స్ నాదస్వర కచేరి వీనులవిందుగా సాగింది.

నేత్ర శస్త్రచికిత్సలకు 18మంది ఎంపిక



శస్త్ర చికిత్సకు బయలుదేరి వెళుతున్న దృశ్యం

రణస్థలం: జె.ఆర్.పురం బ్రాహ్మణవీధిలో కళ్యాణి కంటి పరీక్షా కేంద్రంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 18 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ఎస్.కళ్యాణి తెలిపారు. వీరందరినీ శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బుడుమూరును మండల కేంద్రం చేయాలి



ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

రణస్థలం: లావేరు మండలంలోని బుడుమూరును మండల కేంద్రంగా ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని బుడుమూరు మండల సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం రణస్థలం మండల కేంద్రంలోని ఒక ప్రవేటు ఫంక్షన్ హాల్ వద్ద ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎస్.ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులను కలిసి వినతిపత్రం అందజేశారు.

ముంపులోనే పొలాలు



సతివాడ వద్ద పంటపొలంలో నీరు

గార: మండలంలోని వరి పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. సోమ, మంగళ వారాల్లో కురిసిన భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో తంపర పొలమంతా ముంపులోనే ఉంది. కొత్తూరు–సైరిగాం, రాఘవాపురం, సతివాడ ప్రాంతంలో సుమారు 3 వేల ఎకరాల్లో రెండు రోజులుగా నీరు నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొడాలి రచనా శైలి గొప్పది



హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కొడాలి వెంకట సుబ్బారావు రచనా శైలి ఎంతో గొప్పదని, పరిశీలనాత్మకంగా రచనలు చేస్తారని వక్త పైడి హరనాథరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'హంపీక్షేత్రం–కొడాలి వర్ణనా వైశిష్ట్యం' అనే అంశంపై గురువారం ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు పాల్గొన్నారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా పూడి తిరుపతిరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన సీనియర్ నేత పూడి తిరుపతిరావు మరోసారి నియమితులయ్యారు. ఈయన మూడోసారి ఈ పదవి చేపట్టనున్నారు. ఈ మేరకు బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు వెలువరించారు. ఈయన నియామకంపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, కుమారుడు పూడి బాలాదిత్య, జిల్లా పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఏకదంతాయ.. బహురూపాయ!

వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడలా మండపాల్లో ఏర్పాటు చేసి వివిధ ఆకృతుల్లో గణనాయకున్ని కొలువుదీర్చారు. యువత ఉత్సాహంతో మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ అలంకరణలతో ఒకరితో ఒకరు పోటీపడి విభిన్న ఆకృతుల్లో మండపాలను తీర్చిదిద్దారు. అనంతరం వినాయక వ్రతం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లను, ఇతర ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. విభిన్న రీతిలో కొలువుదీరిన గణనాథులను కుటుంబ సభ్యులతో సహా తరలివచ్చి తిలకించారు. – సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో దశావతారాల వినాయకుడు



అరసవల్లి: రెల్లివీధిలో రావణుడి తలలపై వినాయకుడు



శ్రీకాకుళం కల్చరల్: వినాయకుని అవతారంలో విజయదుర్గ



శ్రీకాకుళం పెద్దరెల్లివీధిలో గణనాథుడు



అక్షర హోసిని అపార్టుమెంట్‌లో వినాయకుడు



శ్రీకాకుళం రూరల్:బైరివానిపేటలో హంసపై కొలువైన గణనాథుడు



శ్రీకాకుళం కల్చరల్: మంగువారితోట సంపత్ వినాయకుని వద్ద పూజలు



శ్రీకాకుళం కల్చరల్: కానుకుర్తివారివీధిలో అనంత పద్మనాభస్వామిగా..



జి సిగడాం: పెంట గ్రామంలో 12 అడుగుల వినాయక విగ్రహం



గార: అంపోలులో రూ. 25 వేల నాణేలతో తయారైన గణపతి వద్ద గ్రామస్తులు



శ్రీకాకుళం కల్చరల్: మావూరి వీధిలో ఊయలపై వినాయకుడు



శ్రీకాకుళం కల్చరల్: పీఎన్‌కాలనీలో వినాయకుడు




శ్రీకాకుళం అర్బన్: గూనపాలెంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



శ్రీకాకుళం కల్చరల్: సాలివీధిలో గణనాథుడు



శ్రీకాకుళం కల్చరల్: దమ్మలవీధిలో శంఖంపై వినాయకుడు



శ్రీకాకుళం రూరల్:సింగుపురంలో కొలువైన వినాయకుడు



శ్రీకాకుళం కల్చరల్: మెహర్‌నగర్‌లో 20 అడుగుల అతిపెద్ద వినాయకుడు

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాటం



రణస్థలంలో ప్రతిజ్ఞ దినం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



ఎచ్చెర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, కార్మికులు

రణస్థలం/ఎచ్చెర్ల: విద్యుత్ పోరాటంలో అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ అమ్మన్నాయుడు, రణస్థలం శాఖ కార్యదర్శి వెలమల రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం రామతీర్థం జంక్షన్ వద్ద విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. స్మార్ట్‌మీటర్లు, పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వీటిని ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఎచ్చెర్ల మండల కేంద్రం వద్ద నిర్వహించిన ప్రతిజ్ఞ దినం కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీపీఎం నాయకులు టి.నందోడు, ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు డి.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఊటగెడ్డ ఆక్రమణలు తొలగించాలి

ఎచ్చెర్ల: మండలంలోని బొంతలకోడూరు, లావేటిపేట, రుప్పపేట తదితర గ్రామాల్లో పంటలను ముంపునకు గురిచేస్తున్న ఊటగెడ్డ ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆర్డీవో సాయిప్రత్యూష ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పాతదిబ్బలపాలెంలో బీచ్ అభివృద్ధి కోసం టూరిజం శాఖకు ఇచ్చేందుకు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆమె ఇక్కడ బొంతలకోడూరు వద్ద నీటమునిగిన పంటలను పరిశీలించారు. ఊటగెడ్డ ఆక్రమణకు గురికావడం వల్లే వర్షపునీరు గెడ్డ నుంచి సముద్రంలోపలికి వెళ్లడం లేదని రైతులు తెలిపారు. సుమారు 200 ఎకరాల పంట నీటమునిగిందని చెప్పారు.



ఆర్డీఓకు పరిస్థితి వివరిస్తున్న సర్పంచ్, రైతులు

కార్యక్రమంలో తహశీల్దార్ బి.గోపాల్, వ్యవసాయాధికారి రాజేష్, బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో అంతర్జాతీయ వర్క్‌షాప్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు తెలిపారు. కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(లండన్), లోకాల్ సెక్షన్ డెక్కన్ హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను యూజీ, పీజీ అధ్యాపకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ బ్రోచర్ ఆవిష్కరించారు. టీఎల్‌సీ– కోలమ్న్ క్రొమోటోగ్రఫీ, సెపరేషన్ అండ్ స్పెక్ట్రోస్కోపీ టెక్నిక్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరగనుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వివిధ వర్సిటీలకు చెందిన నిష్ణాతులు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు హాజరవుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ సీనియర్ లెక్చరర్లు ఆదినారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సింగుపురంలో కార్డన్ సెర్చ్

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల : మండలంలోని కొయ్యాం, కేకేనాయుడుపేట, వీరయ్యవలస, పీకేనాయుడుపేట, కేకేనాయుడుపేట ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ పి.యోగీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో తెలుగు సబ్జెక్టును గెస్ట్ లెక్చరర్ పేరిట బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీలో 55 శాతం తక్కువ కాకుండా మార్కులతో ఉత్తీర్ణత సాధించి, యూజీసీ నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ వంటి అర్హతలు కలిగినవారికి మొదటి ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సులో జారవిడుచుకున్న సెల్‌ఫోన్‌ను సిబ్బంది తిరిగి ప్రయాణికురాలికి అందజేశారు. శ్రీకాకుళం నుంచి శ్రీముఖలింగం బయలుదేరిన రెండో డిపో బస్సులో నీలమ్మ అనే ప్రయాణికురాలు ఎక్కి చల్లపేట వద్ద దిగిపోయింది. ఆ సమయంలో సెల్‌ఫోన్‌ను జారవిడుచుకుంది. బస్సు ముఖలింగం చేరుకున్న సీటులో సెల్‌ఫోన్ గుర్తించిన కండక్టర్ శ్రీనివాస్ ఆరా తీసి శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో డిపో సెక్యూరిటీ గార్డు గోవింద్ ద్వారా అందజేశారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

రణస్థలం: మహిళల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రం రణస్థలంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో మహిళలతో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై సమావేశం నిర్వహించారు.

తెలుగు భాషాభివృద్ధికి.. మేము సైతం!



- అవిశ్రాంత కృషి చేస్తున్న రచయితలు
- పలు సాహితీ సంస్థ ద్వారా సేవలు
- నేడు తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల భాషకు ఆదరణ పెరగడంతో రానురాను తెలుగు భాషపై నేటితరానికి ఆసక్తి తగ్గిపోతోంది. రచనలు సంగతి అటుంచితే తెలుగు చదవడమే గగనమైపోతోంది. ఆంగ్లమాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయని చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను తెలుగుకు దూరం చేయడం, ఇతర కారణాలతో మాతృభాషను మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు భాషాభివృద్ధికి జిల్లాలో ఎంతోమంది తమవంతు కృషి చేస్తున్నారు. పత్రికలు, పుస్తకాల ద్వారా తెలుగు వెలుగులు నేటితరానికి పంచుతున్నారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు స్ఫూర్తిగా భాషాభివృద్ధికి విశేష సేవలందిస్తున్నారు. అధికార భాషా సంఘానికి జిల్లా తొలి సభ్యులుగా ఎస్‌టి.పి.వి.కూర్మాచార్యులు పనిచేశారు. ఈయన ఆంధ్రంలో పండితులు. వీరితో పాటు సుప్రసిద్ధ కథకులు కాళీపట్నం రామారావు, దూసి ధర్మారావు, పులఖండం శ్రీనివాసరావు, పైడి హరనాథరావు, ఛాయారాజ్, మరియాదాస్, రామిశెట్టి, బి.వి.ఎ.రామారావునాయుడు, ఈవేమన, కొనె శ్రీధర్, నల్లి ధర్మారావు వంటి వారు ఉన్నారు. ఎంతోమంది భాషాభిమానులు పలు సాహితీ సంస్థలను ఏర్పాటు చేసి తెలుగు అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తెలుగు మరింత అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో పలు సూచనలు కూడా చేస్తున్నారు.

కొన్ని సూచనలు..

- ప్రభుత్వ అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులోనే జరపడం
- ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని తెలుగులోనే విడుదల చేయడం
- న్యాయశాఖ, న్యాయస్థానాలలో తెలుగు వాడకం పెంచడం, తీర్పులు తెలుగులోనే ఇవ్వడం
- తెలుగు అమలు చేస్తున్న ఉద్యోగులను, సంస్థలను గుర్తించి సత్కరించండం
- కార్యాలయాల పేర్లు తెలుగులో రాయడం
- అన్ని పోటీ పరీక్షల్లో తెలుగులోనే ప్రశ్నపత్రాలు ఇవ్వడం
- రాష్ట్ర, జిల్లా స్థాయి అధికార భాషా సంఘాలకు నిధులు, అధికారాలు పెంచడం
- అందరూ తెలుగులోనే సంతకాలు చేయడం

15ఏళ్లుగా తెలుగు సేవలో..



పదిహేనేళ్ల కిందట తెలుగు రచయితల వేదిక ఏర్పాటు చేశాం. ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి కవులను, రచయితలను గౌరవిస్తున్నాం. ప్రభుత్వపరంగా తెలుగు భాష అమలుకు గట్టి చర్యలు చేపట్టాలి. స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, విద్యాసంస్థలు నడుం బిగించాలి.

– కొనె శ్రీధర్, తెలుగు రచయితల వేదిక వ్యవస్థాపకుడు

పెద్ద బాలశిక్ష చదివించాలి..



తెలుగు భాషా వికాసానికి పాఠశాల స్థాయిలోనే పెద్దబాల శిక్షను చదివితే వందేళ్ల తెలుగు భాషను బతికించినట్లు అవుతుంది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ కృషి చేయాలి. ఇంటర్‌లో వృత్తి విద్యాకోర్సులలో తెలుగు సబ్జెక్టు ప్రవేశపెట్టాలి. చిన్నారులకు తెలుగు చదవడం, రాయడంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

– వాండ్రంగి కొండలరావు, పుస్తక రచయిత, పొందూరు